క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● డీఈఓ ప్రేమ్‌కుమార్



చిలకలపల్లి పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

బలిజిపేట: మనబడి నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈఓ ప్రేమ్‌కుమార్ సూచించారు. మండలంలోని చిలకలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఎప్పటికప్పుడు పనులు జరుగుతున్న తీరును పరిశీలించాలని, పనుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. త్వరితగతిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.గౌరీశంకరరావు, ఏపీఓ ఏగిరెడ్డి శంకరరావు, విద్యాకమిటీ చైర్మన్ ఆర్.ప్రసాదరావు, పీఆర్‌టీ మధు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా వెంకటరావు

సాలూరు: లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా కర్రి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు జర్జాపు సూరిబాబు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. కార్యదర్శిగా జగన్‌మోహన్, కోశాధికారిగా ఈశ్వరరావు కూడా ఏకగ్రీవంగానే ఎన్నిక కాగా వీరందరికీ పట్టణ ప్రముఖులు వాడాడ గణేశ్వరరావు, మండవల్లి సాంబశివరావు, గొర్లె మాధవరావు అభినందనలు తెలిపారు.

ప్రతిరోజూ తాగునీరు అందించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: గ్రామదేవత పండగ రోజుల్లో ప్రతిరోజూ తాగునీరు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె పండగ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.


యోగాతో ఆరోగ్య సిద్ధి



యోగాసనాలను వేస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాను సాధన చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చని శిక్షకులు కె.జనార్దరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. చిన్నారులతో తేలికపాటి ఆసనాలు వేయించారు. ఒక్కో ఆసనం విశిష్టత, దానివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు, ఉపాధ్యాయులు జి.మురళి, ఈశ్వరరావు తదితరులున్నారు.

బహిరంగ మద్యపానం నిషేధం



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై శివప్రసాద్

పాలకొండ రూరల్: బహిరంగంగా మద్యం తాగడం నిషేధమని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. పాలకొండ–సీతంపేట, వీరఘట్టం, విశాఖ రహదారుల్లో ఖాళీ ప్రదేశాలు, రహదారి కల్వర్టు ఖానాలు, శివారు ప్రాంతాల్లో శనివారం మద్యం సేవిస్తున్న పలువురిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వారిపై అపరాధ రుసుం విధించారు.

గృహ నిర్మాణాలపై దృష్టి పెట్టాలి

పాలకొండ రూరల్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలపై సిబ్బంది దృష్టి పెట్టాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. శనివారం తన కార్యాలయంలో సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా లబ్ధిదారుల వివరాలు, నిర్మాణాల తాజా స్థితిగతులపై ఆరాతీశారు. పనులు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది చొరవచూపాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదబోగిలి గ్రామంలో శనివారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందిస్తున్నారని, వీటితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయన్నారు. ఇదే గ్రామంలో సొంతిల్లు లేని ఎంతోమంది పేదలకు ఇంటి స్థలాలతో పాటు, పక్కా ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత కూడా సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. అన్ని వర్గాల మేలు కోరే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా ఆ పార్టీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే వలంటీర్లే నేరుగా పథకాలు ఇంటికి తెచ్చి అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సురగాల గౌరి, బి. కుసుమ, పీఏసీఎస్ చైర్మన్ సాకేటి కూర్మారావు, ఇజ్జాడ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, వెలుగు ఏపీఎం ఆర్. శ్రీరాములు, విద్యుత్ శాఖ ఏఈ సోమేశ్వరరావు, పార్టీ నాయకులు పి. ఈశ్వరనారాయణ, ఆర్‌వీ పార్థసారథి, బి.శంకరరావు, సురగాల కిరణ్‌కుమార్, డి.దేవదానం, యు.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

● వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వలంటీర్లు సంక్షేమ వారధులని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రశంసించారు. మండలంలోని నర్సిపురం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రామసచివాలయ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు తీసుకురావాలన్న సదుద్దేశ్యంతో సచివాలయ వ్యవస్థ, లబ్ధిదారులకు పారదర్శకంగా పథకాలు అందాలన్న లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముమ్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ తిరుపతిరావు, సర్పంచ్‌లు చెరుకుబిల్లి బంగారమ్మ, యాళ్ల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జనచైతన్యానికి ప్రజానాట్యమండలి కృషి



మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ ఈశ్వరరావు

సాలూరు: జనచైతన్యానికి ప్రజానాట్యమండలి విశేషంగా కృషి చేస్తోందని ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని బాగువలస గ్రామంలో ప్రముఖ కళాకారుడు భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న ఆయన కాలక్రమేణా కళలకు, కళాకారులకు ఆదరణ కరువైందని, ఈ నేపథ్యంలో కళల పూర్వ వైభవానికి పాటుపడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మన సంప్రదాయ కళలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళాకారులను గుర్తించి, వారందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి సభ్యులు అప్పారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులకు సర్టిఫికెట్లు అందజేత



వైద్యాధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సీఏసీ శిక్షణ పొందిన వైద్యాధికారులకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌ఓ) బి.జగన్నాథరావు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురక్షిత గర్భస్రావం, గర్భ నిరోధక పద్ధతులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రసవాల సమయంలో సంభవిస్తున్న గర్భిణుల మరణాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి బి.వాగ్దేవి, శిక్షణ కార్యక్రమ నోడల్ అధికారి డీఈఓ టి. జగన్‌మోహన్‌రావు, స్త్రీ వైద్య నిపుణులు శోభారాణి, డీపీహెచ్‌ఎన్‌ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



లచ్చయ్యపేటలో విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఏఈ సోమేశ్వరరావు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వీచిన భారీ ఈదురుగాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని పునరుద్ధించారు. శనివారం మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ఏఈ సోమేశ్వరరావు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు, వీచిన గాలులకు వెంకటాపురం, గుమ్మిడివరం, లచ్చయ్యపేట, వెంకటాపురం, బూర్జ, అజ్జాడ గ్రామాల్లో విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడిపోవడం, మరికొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు పూర్తిగా పడిపోవడం జరిగిందన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి, విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 45 స్తంభాలను ఇంతవరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

సర్వేకు సిగ్నల్ ప్రోబ్లం

సీతంపేట: సిటిజన్ అవుట్ రిచ్‌యాప్ సర్వేతో తిప్పలు తప్పడం లేదు. మారుమూల గ్రామాల్లో గ్రామ వలంటీర్లు సర్వే చేస్తున్నప్పటికీ సెల్ సిగ్నల్ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. టిటుకుపాయి, టిటుకుపాయిగూడ తదితర ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది గ్రామస్తులను సెల్ సిగ్నల్ వచ్చే చోటుకు తీసుకువెళ్లి సర్వే చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: భామిని మండలం లోహరజోల గ్రామానికి చెందిన బోనగడ్డి చక్రవర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఈ విషయాన్ని స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కళావతి బాధితుడికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం సహాయ నిధి నుంచి రూ.70 వేలు మంజూరు కావడంతో ఆ చెక్కును వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం బాధితుడికి అందజేశారు.

గిరిజన మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

కురుపాం: గిరిజన మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్, ఎం.రమణ కోరారు. మండలంలోని నీలకంఠాపురంలో గిరిజన సంఘం 7వ మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. గిరిజనుల హక్కుల సాధనే లక్ష్యంగా జూన్ 16, 17 తేదీల్లో ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీను, కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయం లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం వెంకట్

జియ్యమ్మవలస: మండలంలోని వెలుగు కార్యాలయంలో రైతులకు సమీకృత వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకట్ మాట్లాడుతూ.. తక్కువ స్థలంలో అన్ని రకాల పంటలను ఏ విధంగా సాగు చేయవచ్చో వివరించారు. గొర్రెలు, మేకలు, పశువుల వ్యర్థాలను పంటకు ఎరువుగా ఉపయోగించడం ద్వారా నేల సారవంతమై పంట దిగుబడి పెరుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్ కుమార్, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు హిమరిక చక్రపాణి, వెలుగు సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

నకిలీ కులధ్రువీకరణ పత్రాలపై విచారణ

సీతంపేట: బెంతొరియా కులధ్రువీకరణ పత్రాల మంజూరుపై డీఎల్ఎస్‌సీ సమావేశంలో శనివారం విచారణ చేపట్టారు. నకిలీ బెంతొరియా సర్టిఫికెట్లతో ముగ్గురు ఉద్యోగం చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో వాటిపై విచారణ చేశారు. కంచిలికి చెందిన పూర్ణచంద్రదొలైను ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆయన జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేశారు. దీంతో పాటు మరోరెండు ఆరోపణలపై గిరిజన సంక్షేమశాఖ డీడీ నగేష్, ఏపీవో రోషిరెడ్డి, పలాస ఆర్డీవో సీతారామమూర్తి విచారణ చేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం..



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కురుపాం: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అటవీశాఖ బీటు అధికారి కె.ఆనంద్ కోరారు. మంతినివలస గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై శనివారం యువతకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ విచ్ఛిన్నం అయ్యేందుకు వేల సంవత్సరాల సమయం పడుతుందని, ప్లాస్టిక్ సంచులు, బ్యాగులను విచ్చలవిడిగి వినియోగించడం ద్వారా భూమిపై వాటి వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, ఫలితంగా పర్యావరణానికి, మానవాళికి అనేక విధాలుగా ముప్పు వాటిల్లుతోందని వివరించారు. ప్రజలు ప్లాస్టిక్ సంచులకు బదులు గోనె, కాగితపు సంచులను వినియోగించాలని కోరారు.

పాఠశాలల పునఃప్రారంభం నాడే విద్యాకానుకల పంపిణీ



యూనిఫాంలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం నాడే జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయనున్నట్లు డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన జగనన్న విద్యాకానుక కిట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 12,033 పాఠ్యపుస్తకాలు, 4,024 మంది విద్యార్థులకు యూనిఫాంలు వచ్చాయన్నారు. ఇంకా బ్యాగులు, నోట్‌పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాల భవనాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి రెండో విడతలో చేపట్టిన నాడు–నేడు పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ వై.శంకరరావు, హెచ్‌ఎం ఎస్.పాత్రుడు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సుస్థిర ఆదాయం



రైతులకు నవధాన్యాల కిట్లను అందజేస్తున్న డీపీఎం పి.షణ్ముఖరావు

గుమ్మలక్ష్మీపురం: సుస్థిర ఆదాయం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమౌతుందని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు రైతుభరోసా కేంద్రం వద్ద శనివారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 70 మంది రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం డీపీఎం మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని, వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు రావన్నారు. నవధాన్యాల విత్తనాలను తొలకరి వర్షాలకు ముందు నాటుకోవాలని, 45 రోజుల తర్వాత పంటను భూమిలో కలియదున్నడం ద్వారా అందులోని సేంద్రియ పదార్థాలు నేలను చేరి పొలం సారవంతంగా మారుతుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్‌తో పాటు జట్టు సంస్థ సంయుక్తంగా గుమ్మలక్ష్మీపురం మండలంను శాతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జట్టు సంస్థ ప్రతినిధులు ఎం.సీతారాం, పి.జగదీష్, టి.మన్మథరావు, పి.శ్రావణి, ఎస్.లత తదితరులున్నారు.

అంధత్వ నివారణకు ప్రభుత్వం కృషి

● జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జగన్నాథరావు



నేత్ర వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: అంధత్వ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జగన్నాథరావు తెలిపారు. వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగన్నాథపురం ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించి, కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, తగిన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. అంతకుముందు శిబిరానికి హాజరైన వృద్ధుల కళ్లను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన వారిని పుష్పగిరి కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కంటి వెలుగు సెల్ అధికారి, నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యను ప్రోత్సహించాలి



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న సెట్విజ్ సీఈఓ రామగోపాల్

● సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్

సీతానగరం: పాఠశాలల్లో విద్యతో పాటు వ్యాయామ విద్యను కూడా ప్రోత్సహించాలని సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య నిర్వహిస్తున్న క్రీడాపోటీలు, వివిధ క్రీడల్లో ఇస్తున్న శిక్షణను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని కోరారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని ఉదహరించారు. వ్యాయామ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ఆయన తనవంతు సాయంగా పలువురు క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు చేయడం తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: సాలూరులో ఇటీవల నిర్వహించిన టీడీపీ మినీ మహానాడులో ఆ పార్టీ సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మడి సంధ్యారాణి వైఎస్సార్ సీపీ నాయకులపై చేసిన ఆరోపణలను పాచిపెంట ఎంపీపీ బద్నాన ప్రమీల ఖండించారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర, తమ పార్టీ నాయకులపై సంధ్యారాణి లేనిపోని ఆరోపణలు చేశారని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలుసు అన్నారు. రాజన్నదొరపై ప్రజలకు నమ్మకం ఉంది కనుకనే ఆయనను వరుగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. అవినీతి, అక్రమాలు చేశారు కాబట్టే టీడీపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కొంతమంది టీడీపీ నేతలు ప్రజల్లో తమ ఉనికిని చాటుకునేందుకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆరోపణలు చేస్తే ప్రజల విశ్వాసం ఎప్పుడూ పొందలేరన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజలకు చేస్తున్న మేలును ఒప్పుకుని, మంచి నీతివంతమైన నాయకులుగానైనా కనీసం గుర్తింపు పొందాలని హితవుపలికారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కొమరాడ: చిన్నారుల ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి, చంద్రంపేట, తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో 2 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లల ఆరోగ్య వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. వారికి సకాలంలో టీకాలు వేయాలన్నారు. 9 నెలలు నిండిన పిల్లలకు మిజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ మొదటి డోసు, 16 నెలలు పూర్తయిన వారికి రెండో డోసు తప్పనిసరిగా వేయాలన్నారు. పిల్లల వయస్సు, బరువు, ఇతర ఆరోగ్య వివరాలతో హెల్త్ రికార్డు నిర్వహించాలన్నారు.